


శ్రీశైలం ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖరరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖరరెడ్డి

శ్రీశైలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా ఇ.చంద్రశేఖరరెడ్డి శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. శ్రీశైలం దేవస్థానం ఈవో విధులు నిర్వహిస్తున్న డి.పెద్దిరాజును ఆయన మాతృ శాఖకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీశైలం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణకు ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్తర్వులను అనుసరించి శనివారం ఉదయం ఆలయ పరిపాలన భవనంలోని ఈవో చాంబర్ లో ఇ. చంద్రశేఖరరెడ్డి శ్రీశైలం దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆలయ సంప్రదాయాలను అనుసరించి ఆలయ అర్చకులు, వేదపండితులు చంద్రశేఖరరెడ్డికి వేదాశీర్వాదం పలికారు. అనంతరం దేవస్థానం అన్ని విభాగాల యూనిట్ అధికారులతో మాట్లాడుతూ రానున్న కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో బెదిరింపులు

కర్నూలులో నకిలీ అధికారుల గుర్తింపు

వివరాలు 7లో

కోడలిని హతమార్చిన మామ అరెస్టు

7

ఎమ్మెల్యే అనుచరుడి భూ కబ్జా

7లో

ఉన్నది ఒక్కటే జిమ్‌దగీ..!



ఆడవాళ్లు తమ జీవితంలోని ప్రతి దశలోనూ విభిన్న రకాల మార్పులు ఎదుర్కొంటూ ఉంటారు. వీటి కారణంగా వారి ఫిట్‌నెస్ దెబ్బతింటుంది. ముఖ్యంగా ఇప్పుడు అమ్మాయిలు ఇంటి పనులు చేసుకుంటూ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. దీనివల్ల తొందరగా అలసిపోతారు. మగవారితో పోలిస్తే అమ్మాయిల్లో హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఉండాలన్నా, మహిళలు తమ ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి చీకు చింతా ఎదుర్కోకూడదన్నా వారి శరీరంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలి. శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే వ్యాయామం చేయాల్సిందే. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి వారు జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం చేస్తున్నారు. దీని వల్ల శారీరకంగానే కాదు, మానసికంగా కూడ అనేక ప్రయోజనాలు పొందుతున్నారు.

6లో..

పవర్ గ్రిడ్ కాంట్రాక్టర్ల దౌర్జన్యం

- పంటలు ధ్వంసం చేస్తూ విద్యుత్ టవర్ల నిర్మాణాలు
- ప్రధానికి లేఖ రాసిన రైతులు
- పీఎంవో ఆదేశాలతో కదిలిన అధికారులు



రైతులతో చర్చిస్తున్న తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి

పాణ్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ కాంట్రాక్టర్ల దౌర్జన్యంపై కౌలూరు, బలపనూరు, నెరవాడ గ్రామాల రైతులు ప్రధానమంత్రికి లేఖ రాశారు. పంటలు ధ్వంసం చేస్తూ విద్యుత్ టవర్ల నిర్మాణాలు చేపడుతున్నారని, అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారని అందులో పేర్కొన్నారు. దీంతో ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి సమస్యను పరిష్కరించి నివేదిక అందజేయాలని కలెక్టరును ఆదేశించిది. దీంతో కలెక్టర్ స్పందించి రైతులతో మాట్లాడాలని పాణ్యం తహసీల్దారుకు సూచించారు. శనివారం రైతులు, పవర్‌గ్రిడ్ డీజీఎం రాజమోహన్‌తో తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి చర్చించారు. పంట భూముల్లో పవర్‌గ్రిడ్ కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా విద్యుత్ టవర్ల నిర్మాణాలు చేపడుతున్నారని రైతులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. భూముల యజమానులకు సమాచారం లేకుండా పంటలను ఎలా ధ్వంసం చేస్తారని నిలదీశారు. స్పందనలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోవడంతో ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. నష్ట పరిహారం పెంచాలని, విద్యుత్ తీగెలు వెళ్లే మార్గంలో వేసిన పంటలకు కూడా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పవర్‌గ్రిడ్ డీజీఎం రాజమోహన్ మాట్లాడుతూ రైతుల సహకారంతోనే విద్యుత్ టవర్ల నిర్మాణాలు కొనసాగిస్తామన్నారు.

శ్రీశైల జలాశయం నాలుగు గేట్ల ఎత్తివేత

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



నాలుగు గేట్ల ద్వారా దిగువకు ప్రవహిస్తున్న వరద

శ్రీశైలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. జలాశయానికి వరద భారీగా కొనసాగుతుండడంతో శనివారం డ్యాం అధికారులు 4 క్రస్టుగేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 72,114 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 మొత్తం 1,90,828 వరద నీరు వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,25,641 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.8824 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,139 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,900 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం నాలుగు క్రస్టు గేట్ల ద్వారా 1,11,932 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

వానల్లో మొక్కజొన్న రైతు

- తుఫాను ప్రభావంతో విలవిల్లాడుతున్న రైతులు
- దిగుబడులను కాపాడుకునేందుకు అవస్థలు
- తడిసిన మొక్కజొన్నను కొనని వ్యాపారులు
- ప్రభుత్వమే కొనాలంటున్న రైతులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. పంట దిగుబడులు కళ్ల ముందే వర్షార్పణం అవుతుండడంతో రైతులు కన్నీరు కార్చుతున్నారు. తుఫాను ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. వర్షాలతో తడిసిపోయి మొలకెత్తుతున్న మొక్కజొన్నలను చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు

గిట్టుబాటు ధర కల్పించాలి



మొక్కజొన్న గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలి. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో నష్టపోయాను.

-బాషా, రైతు, చింతకుంట్ల గ్రామం

గింజలు మొలకెత్తుతున్నాయి



మొక్కజొన్న దిగుబడులు ఆరబెట్టుకుని విక్రయించాలనుకుంటున్న తరుణంలో కురుస్తున్న వర్షాలతో గింజలు మొలకెత్తుతున్నాయి. దీంతో వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా దిగుబడులు అరకొరగా మాత్రమే వచ్చాయి. నెలల తరబడి కాయకష్టం చేసి పంటలు పండిస్తే పెట్టుబడులు సైతం దక్కకపోవడంతో అప్పులపాలవుతున్నాం.

-పెద్ద వలి, రైతు, చింతకుంట్ల గ్రామం

తగ్గిన దిగుబడి.. పతనమైన ధర

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో రైతులు మొక్కజొన్న పంటను విరివిగా సాగు చేశారు. జిల్లాలో మొక్కజొన్న సాధారణ సాగు దాదాపు 47 వేల హెక్టార్లుండగా ఈ ఏడాది 20 శాతం అదనంగా దాదాపు 56 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టి రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. ఆగస్టు చివరి నుంచి మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలకు ముందు కోసిన రైతులకు ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. గడిచిన నెల వ్యవధిలో తుఫాను, అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలతో మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వచ్చాయి. ఒక్కసారిగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023-24లో మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.2,090 ఉండగా 2024-25కు గాను కేంద్రం రూ.135 పెంచి మద్దతు ధరను రూ.2,225గా నిర్ణయించింది. సెప్టెంబరు నెలలో క్వింటం మొక్కజొన్న ధర రూ.2,500 నుంచి రూ.2,800 వరకు ఉండగా ఈ నెలలో క్వింటం రూ.2 వేలు నుంచి రూ.2,200 వరకు రైతులు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రహదారులు, కల్లాల్లో ఆరబెట్టుకుంటున్న ధాన్యం తడిసిపోవడంతో గింజలు రంగుమారి మొలకెత్తుతున్నాయి. ఇలాంటి ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. తడిసిపోయిన మొక్కజొన్న గింజలను క్వింటం రూ.1,500 నుంచి రూ.1,800 వరకు అడుగుతున్నారు. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.



తడిసిన మొక్కజొన్న దిగుబడులను ఆరబెడుతున్న రైతులు



వర్షానికి తడిసిన మొక్కజొన్న గింజలు

ప్రభుత్వమే కొనాలంటున్న రైతులు

మొక్కజొన్నకు గిరాకీ పెరగడంతో జిల్లాలోని రైతులు పోటీపడి పంటను సాగు చేశారు. కౌలు రైతులు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి మరీ మొక్కజొన్న సాగు చేపట్టారు. దిగుబడులు ఇంటికి వచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న గింజలు తడిసిపోయి రంగు మారడంతో పాటు బూజు పడుతున్నాయి. దీంతో ఆ దిగుబడులను కొనేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న గింజలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే అరకొర నష్టాలతో బయటపడతామని.. లేని పక్షంలో మరింత నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

లక్ష్యాలను అధిగమించండి

పీఎం సురక్షా, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాలపై కలెక్టర్ రాజకుమారి



బీమా పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ, బ్యాంకు అధికారులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేటాయించిన లక్ష్యాలను మించి వృద్ధి రేటు సాధించాలని కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రభుత్వ పథక రుణాల మంజూరుపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథక రుణాల మంజూరుకు సంబంధించి అధికారులతో పాటు బ్యాంకర్లు కూడా సపోర్ట్ ఇచ్చి లబ్ధిదారుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. సామాన్య ప్రజలకు ప్రమాద బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్షా, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాల కింద అర్హులైన ఖాతాదారులను నమోదు చేయించి స్కీం ఉపయోగాలు వివరించాలన్నారు.

తిరిగి వచ్చిన ఆనందం

- 16 సంవత్సరాల తర్వాత ఊరికి వచ్చిన సుందరరాజు
- ఆనందంలో కుటుంబ సభ్యులు



సుందరరాజు

వెల్దుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించడంతో 16 ఏళ్ల కిందట మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి తిరిగి వచ్చాడు. ఇక లేడు.. రాడు అనుకున్న కుటుంబ సభ్యులు హఠాత్తుగా తిరిగి రావడంతో ఆ కుటుంబంలో సంతోషం వెల్లివెరిసింది. మండలంలో అల్లుగుండు గ్రామానికి చెందిన సుందరమ్మ, సుంకన్నల చిన్న కుమారుడు సుందరరాజు. 15 ఏళ్ల వయస్సులో చదువు మధ్యలో మానేసి సెంట్రింగ్ పనికి వెళుతుండేవాడు. స్నేహితులతో అతి స్నేహం మంచిది కాదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన సుందరరాజు సెంట్రింగ్ పనికి దూరప్రాంతాలకు వెళ్లాడు. ఆ క్రమంలో హైదరాబాదు చేరుకొని అక్కడ సెంట్రింగ్ పని చేస్తూ ఓ ముస్లిం అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం సుందరరాజు వయస్సు 31 సంవత్సరాలు. కుటుంబ సభ్యులను చూడాలన్న ఆకాంక్షతో హైదరాబాదు నుంచి రెండు రోజుల కిందట వెల్దుర్తికి చేరుకున్నాడు. అప్పట్లో సుందరరాజు చూసిన ప్రదేశాలు, ప్రాంతాలు మారడంతో అర్థంకాక రెండు రోజులుగా వెల్దుర్తిలో తిరిగాడు. ఈ క్రమంలో సుందరరాజుకు చెందిన దూరపు బంధువు వెల్దుర్తిలో గమనించి వారి తల్లిదండ్రుల పేర్లు, స్వస్థలం వివరాలు తెలుసుకొని స్వగ్రామం అల్లుగుండుకు తీసుకెళ్లాడు. సుదీర్ఘకాలం తర్వాత ఆయన తిరిగి రావడంతో ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది.



కుటుంబ సభ్యులతో సుందరరాజు

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. సమాజంలో మత్తు పదార్థాలు వాటి దుష్ప్రభావాలపై ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ వైస్ ప్రిన్సిపాల్ డా. సాయిసుధీర్ ఆధ్వర్యంలో కేఎంసీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో జోనల్ సీఎంఈ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి, నీరు, నేల, కాలుష్యమైతే, దాని ప్రభావం మనిషిపై పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పృథ్వీ వెంకటేశ్వర్లు, రాయలసీమలోని సీనియర్ ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణుడు డా.శంకర్, డా. వీరనాగిరెడ్డి, డా. బ్రహ్మాజీ మాస్టర్, డా. బాబు, డా. ప్రభాకర్, డా. జగదీష్ నాయక్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



రాయలసీమ ఫ్లోరెన్సిక్ జోనల్ సీఎంఈలో పాల్గొన్న వైద్యులు

ఉన్నది ఒక్కటే జిమ్‌దగీ..!

- శరీరాకృతి కోసం మహిళల ఫీట్లు
- బరువు తగ్గేందుకు ప్రాధాన్యం
- ఆసక్తి కనబరుస్తున్న నగర మహిళలు, యువతులు





కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిమ్ గురించి అంద రికి తెలుసు. వ్యాయా మశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్, టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కు వెళ్తున్నారు. మహిళలు జిమ్‌కు వెళ్లి కార్డియో, కాళ్లు, వెయిల్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు. క్రాస్ ఫిట్, జుంబా, కార్డియా వర్క్‌అవుట్ చేస్తున్నారు. ఎముకలు బలహీనంగా ఉండటంతో బలం కోసం పరికరాలు, రాడ్స్, డమ్మెల్స్, బార్‌బెల్ తదితర వాటితో జిమ్‌లో కుస్తీపడుతున్నారు. బాడీమూవ్‌మెంట్స్, వాల్‌పుషప్స్‌తో పాటు వివిధ రకాల డ్యాన్సులతో వ్యాయామం చేస్తున్నారు. బరువుతో పాటు బీపీ,షుగర్ ఉండే మహిళలు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్, లీన్ ప్రొటీన్స్, డ్రైఫ్రూట్స్ వాటిని ఆహారంలో తీసుకుంటుంటారు.

ఉత్సాహంగా ఉంటుంది



ఉదయమే జిమ్‌కు వచ్చి వర్కవుట్ చేస్తే రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. నేను బ్యాడ్మింటన్ ప్లేయర్‌ను. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో కూడా పాల్గొన్నా. శరీర ఆకృతితో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జిమ్ ఎంతో ఉపయోగపడుతుంది.

-రుషిత

12 కేజీలు తగ్గాను



జిమ్‌కు రాకముందు నేను 78 కేజీలు ఉన్నాను. జిమ్‌కు వచ్చాక ఇక్కడ నేర్పిస్తున్న వ్యాయామంతో సుమారు 12 కేజీలు తగ్గాను. బరువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకుంటున్నా. ఇక్కడ మహిళల వయస్సును బట్టి వివిధ రకాల ప్రొటీన్ ఫుడ్స్ ఇస్తుంటారు. వాటితో బరువు తగ్గడంతోపాటు ఉల్లాసంగా కూడా ఉండొచ్చు. - వినీత

ఎముకల బలిష్టం కోసం జిమ్



మహిళల్లో అత్యధికంగా హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడటంతో ఒక్కసారిగా బరువు పెరుగుతారు. దీంతోపాటు ఎముకల బలిష్టం కోసం జిమ్‌కు వస్తుంటారు. ప్రధానంగా వయస్సును బట్టి మహిళలకు జిమ్‌లో వివిధ రకరా పరికరాలతో వ్యాయామం చేయిస్తుంటాం. అత్యధికంగా జిమ్ చేయడం వల్ల నష్టం కూడా జరుగుతుంది.

-అబుజర్, జిమ్ శిక్షకుడు

బరువు తగ్గించుకునేందుకే జిమ్‌కు..



మహిళలు అత్యధికంగా బరువు తగ్గించుకోవడానికే జిమ్‌కు వస్తుంటారు. ప్రధానంగా అధిక బరువు ఉండే మహిళలు ఇంట్లో ఎక్కువగా పని చేసుకునేందుకు వీలుగా ఉండదు. దీంతో పాటు మహిళల్లో ఎక్కువ శాతం థైరాయిడ్ బారిన పడుతుంటారు. అలాంటి వారి కోసం ప్రత్యేకమై జిమ్ వర్క్ అవుట్‌లు చేయిస్తుంటాం.

-కుషిత, జిమ్ శిక్షకురాలు

17 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వరకు..

ఒకప్పుడు జిమ్‌లలో పురుషులే ఉండేవారు. కానీ ప్రస్తుతం 17 ఏళ్ల నుంచి 65 సంవత్సరాల వయస్సు వరకు మహిళలు కూడా ఉన్నారు. వయస్సును బట్టి శిక్షకులు మహిళలకు జిమ్‌లో వ్యాయామం నేర్పిస్తున్నారు. వారికి వ్యాయామ పద్ధతులు, సరైన ఆహారం గురించి తెలపడానికి శిక్షకులు కూడా అందుబాటులో ఉన్నారు. జిమ్‌లో స్త్రీలు కూడా ఫిట్‌నెస్ కోసం హాజరవుతున్నారు. వారి ఆరోగ్యం, శరీర ఆకారం, మానసిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి జిమ్‌లో వ్యాయామం చేస్తున్నారు. కొంతమంది మహిళలు పోటీల్లో పాల్గొనడానికి శిక్షణ పొందుతున్నారు. జిమ్‌లో మహిళలు వ్యాయామం చేయడం వల్ల వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వారు తమ శరీరం గురించి మరింత సంతృప్తి చెందుతారు. వారి మానసిక స్థితి మెరుగుపడుతుంది.



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

క్రీడల విజయానికి కృషి చేయండి : జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలను నంద్యాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నుంచి 22 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడా అధికారులు పాల్గొననున్నట్లు తెలియజేశారు. అనంతరం క్రీడల ఏర్పాట్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వహణ కోసం వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంటకు ఎర్ర తెగులు

గొర్రెల మేతకు వదిలేసిన రైతు

కోసిగి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటకు ఎర్ర తెగులు సోకింది. దీంతో ఓ రైతు పంటను పశువులకు వదిలేశాడు. మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. వర్షాలకు పత్తి కాయలు కుళ్లి పోవడంతో శనివారం గొర్రెలు, మేకలు, ఆవుల మేతకు వదిలేశాడు. సుమారు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు రామిరెడ్డి కోరుతున్నాడు.


మేకలకు మేతగా వదిలేసిన పత్తి పంట

అస్టియోపోరాసిస్‌తో ఎముకలు గుల్ల

- ఎముకలు పెళుసుబారితే ప్రమాదం
- నేడు వరల్డ్ అస్టియోపోరాసిస్ డే


కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎముకలను గుల్ల చేసే వ్యాధిని అస్టియోపోరాసిస్ అంటారు. దీన్ని తెలుగులో బోలు ఎముకల వ్యాధి అని పిలుస్తారు. ఎముకలు బలంగా ఉంటేనే.. మనం ఏ పనైనా చేయగలం. ఎంత బరువైనా ఎత్తగలం. ఎముకలు బలహీనంగా మారితే కనీసం పది నిమిషాలు కూడా కూర్చుని పని చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. కింద పడినప్పుడు చేతులు, కాళ్ల ఎముకలు విరిగిపోతాయి. కొన్ని సందర్భాల్లో ఏ కారణం లేకుండానే ఎముకలు విరగొచ్చు. దీన్ని ఆస్టియోపోరాసిస్ అంటారు. 1996లో మొదటి ఆస్టియోపోరాసిస్ కేసును గుర్తించారు. 1997లో ఇంటర్నేషనల్ అస్టియోపోరాసిస్ ఫౌండేషన్ ప్రపంచ బోలు ఎముకల వ్యాధి దినం నిర్వహిస్తోంది. 2024లో ఇంటర్నేషనల్ అసియోపోరాసిస్ ఫౌండేషన్ పెళుసుగా ఉండే ఎముకలకు నో చెప్పండి అన్న నినాదాన్ని ఇచ్చింది.




ఆస్టియోపోరాసిస్ ప్రారంభ దశలో లక్షణాలేవీ కనిపించవు. వ్యాధి క్రమంగా తీవ్రమై ఎముకలు విరిగినప్పుడే గుర్తించే వీలు కలుగుతుంది. తగినంత సూర్యరశ్మిని అందనివారు, వ్యాయామం చేయనివారు దీని బారిన పడే అవకాశం ఉంది. మద్యపానం, ధూమపానం అలవాటు ఎక్కువగా ఉన్న వారికి, కుటుంబంలో ఇంతకుముందు ఎవరికైనా వ్యాధి ఉన్నవారికి జన్యుపరంగా ఇది వ్యాపిస్తుంది.

లక్షణాలు: వెన్నునొప్పి వస్తుంది. శరీరాకృతి వంగిపోతుంది. ఎత్తు తగ్గుతున్నట్లు కనిపిస్తుంది. చిన్న ప్రమాదాలకే ఎముకలు విరిగిపోతుంటాయి. ఇవి ఈ వ్యాధి సాధారణ లక్షణాలు. వెన్నుపూసలో పగుళ్లు ఏర్పడితే వెన్నుముక తుంటి ప్రాంతంలో నొప్పి వస్తుంది. ఎముకల్లో ఏర్పడిన పగుళ్లు త్వరగా నయం కావు. కోలుకోవడానికి సమయం పడుతుంది.

- **రోగ నిర్ధారణ:** ఎక్స్‌రే ద్వారా ఆస్టియోపోరాసిస్ వ్యాధిని నిర్ధారించవచ్చు. ప్రారంభంలో వ్యాధి లక్షణాలను గుర్తించడానికి, సరైన చికిత్స అందించడానికి డెక్సాస్కాన్ (బోన్ డెన్సిటి స్కాన్) సహాయపడుతుంది. ఈ స్కాన్ కర్నూలు జీజీహెచ్‌లోని న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో ఉంది.
- **చికిత్స ఇలా:** ఈ వ్యాధి బారిన పడిన వారిలో వైద్యుల సలహాలతో మందులు వాడాలి. వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. మద్యపానం, పొగతాగడం మానేయాలి. ఎముకల ధృఢత్వానికి విటమిన్-డి లభించే ఆహారం తీసుకోవాలి. ప్రతి రోజు ఉదయం ఎండలో ఉండాలి.



ఎముకలను బలోపేతం చేయడానికి శరీరానికి కాల్షియం పదార్థాలైన పాల ఆహారాలు, పాలు, పెరుగు, చీజ్, ఆకుకూరలు, నారింజ, బీన్స్ బఠానీలను తీసుకోవాలి.

మహిళల్లో బోలు వ్యాధి ఎక్కువ



బోలు ఎముకల వ్యాధి మహిళలు ఎక్కువ. 40 నుంచి 50 సంవత్సరాలు ఉన్న మహిళల్లో హార్మోన్ల మార్పుల వల్ల ఎముకలు పలుచబడి ఈ వ్యాధి కనిపిస్తుంది. చాలా మంది రోగులు కాల్షియం ఉన్న ఆహారం, పండ్లు తీసుకోకపోవడం, విటమిన్-డీ లోపం వల్ల ఎముకలు బలహీనమవుతాయి. దేశంలో ఈ సమస్యతో 50శాతం మంది బాధపడుతున్నారు.

- డా.ఎం.రాజేష్ కుమార్, ఆర్థోసర్జన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఆర్థోపెడిక్, కర్నూలు జీజీహెచ్

ప్రారంభదశలో గుర్తించాలి



ఆస్టియోపోరాసిస్ వ్యాధి ప్రారంభదశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. వ్యాధి తీవ్రమై ఎముకలు విరిగినప్పుడు మాత్రమే గుర్తించగలం. కాబట్టి ఈ వ్యాధిని ప్రారంభదశలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. ఎముకలు బలహీనమైనప్పుడు తుంటి, మణికట్టు, వెన్నముక వంటి ఎముకలు ఫ్యాక్చర్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- డా.ఎం. విజయకుమార్ రెడ్డి, ఆర్థోసర్జన్, శ్రీచక్ర హాస్పిటల్, కర్నూలు

తీవ్రమైన ఆరోగ్య ముప్పు



బోలు ఎముకల వ్యాధి ప్రమాదకరమైనది. ఈ వ్యాధి కారణాలను గుర్తించి స్కీనింగ్ చేయించుకోవాలి. ముఖ్యంగా వృద్ధుల్లో బోలు వ్యాధి దీర్ఘకాలిక వైకల్యానికి దారితీస్తుంది. మితిమీరిన మద్యపానం, ధూమపానంతో ఎముకలు గుల్లబారుతాయి. రెగ్యులర్‌గా ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవాలి.

-డా. జీవీఎస్ రవిబాబు, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, ఆర్థోసర్జన్, కర్నూలు

సమస్యల పరిష్కారంపై అధ్యయనం చేయాలి

పాణ్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు వాస్తవ జీవనంలో జరిగే సమస్యల పరిష్కారంపై అధ్యయనం చేయాలని ప్రముఖ పరిశ్రమల నిపుణులు పేర్కొన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న కోడ్ క్వెస్ట్24 హ్యాకతాన్ సదస్సు శనివారం ముగిసింది. సీఎస్ఈ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన సాఫ్ట్ క్లౌడ్, వెల్స్ ఫార్గో, స్కాప్రస్టీరియా ఇండియా, రెడీకా సిస్టమ్స్, రాక్‌స్టార్ గేమ్స్, చెన్నై కుచెందిన ఫోర్డ్ మోటార్స్ కంపెనీ, హైదరాబాదుకు చెందిన టాటా కన్‌సల్టెన్సీ సర్వీసెస్‌కు చెందిన సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో విద్యార్థులకు ఇచ్చిన ప్రాజెక్టుల్లో ఎంతో ప్రతిభ కనబర్చారన్నారు. మన చుట్టూ ఉండే పలు సమస్యలను గుర్తించడంలో విద్యార్థులు ఎంతో నైపుణ్యం సాధించారని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల సమస్యలు, ఉన్నత స్థాయికి ఎదిగిన వారి అభిప్రాయాలు సేకరించడం హర్షణీయమన్నారు. సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఎంచుకున్న విధానాలు ఎంతో ఆలోచింపజేశాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బృందాలకు యాపిల్‌మ్యాక్ బుక్, హెచ్‌పీ విక్టర్స్, ఏసర్ ఆస్పైర్‌లు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల నిపుణులు హర్షప్రసాద్, సుధాకర్ కాటం, కిషోర్‌కుమార్, వెంకటసాయినాథ్, కార్తీక్, రోషన్ జమీర్, డీన్ రామిరెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ సుబ్బారెడ్డి, భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రాజెక్టు విజేతలతో పరిశ్రమల నిపుణులు, అధ్యాపకులు

రబీ పంటలకు మద్దతు ధర

- రైతులకు ఊరట



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత రబీలో సాగు చేస్తున్న పంటలకు మద్దతు ధరను పెంచింది. ప్రధానంగా ఈ సీజన్‌లో సాగయ్యే పప్పుశనగతోపాటు ఆవాలు, ఎర్ర కంది పప్పు, బార్లీ, గోధుమ, కుసుమ పంటల మద్దతు ధరను పెంచుతూ రెండు రోజుల క్రితం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పప్పుశనగతోపాటు ఆవాలు, కొంత మేర గోధుమ, కుసుమ పంటలను సాగు చేస్తున్నారు. శనగ పంటకు గత సంవత్సరం క్వింటానికి రూ.5,440 మద్దతు ధర ఉండగా.. ప్రస్తుత రబీ నుంచి రూ.5,550 అంటే రూ.210 అదనంగా పెంచారు. అదే విధంగా కుసుమ పంటకు గత ఏడాది రూ.5,800 ధర ఉండగా.. ఈసారి రూ.5,940కు అంటే రూ.140 అదనంగా పెంచారు. గోధుమ పంటకు రూ.2,275 ధర ఉంటే.. ఈసారి రబీకి రూ.2,425 ధరను పెంచారు. దీని వల్ల రూ.150 అదనంగా పెంచినట్లయింది.

చెబుతున్నారు. శనగ పంట సాగుకు ఎకరాకు అన్ని ఖర్చులు కలిపి రూ.8వేల దాకా అవుతుంది. వేరుశనగ, వరి మొక్కజొన్న తదితర పంటల సాగు ఖర్చుతో పోలిస్తే.. ఈ పెట్టుబడి చాలా తక్కువ అని రైతులు పేర్కొంటున్నారు. సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే నల్లరేగడి పొలాల్లో 6 నుంచి 7 క్వింటాళ్ల శనగ పంటలో దిగుబడి వస్తుంది. ఎర్రనేలలు, తువ్వ తదితర పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి కుసుమ సాగుకు పెట్టుబడి రూ.12వేలు అవుతుంది. నల్లరేగడి పొలాల్లో ఈ పంట దిగుబడి 7 నుంచి 8 క్వింటాళ్లు చేతికి అందుతుందని, సాధారణ పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, అదే విధంగా గోధుమ సాగులో ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి అవుతుందని, దిగుబడి రూ.6 క్వింటాళ్ల వరకు లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రస్తుతం రబీలో రైతులు శనగ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. కుసుమ, గోధుమ కొంత మొత్తంలోనే సాగవుతోంది. తాజాగా పెరిగిన మద్దతు ధరల నేపథ్యంలో పై పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంపై పంటలకు పెంచిన మద్దతు ధరలను దృష్టిలో ఉంచుకుని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పంటల సాగుకు పెట్టుబడి మిగిలిన పంటలతో పోలిస్తే చాలా తక్కువ. దిగుబడి ఎక్కువగా ఉంటుందని రైతులు

మద్దతు ధర పెరగడంతో రైతులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత రబీలో శనగతో పాటు గోధుమ, కుసుమ, ఆవాలు తదితర 6 పంటలకు మద్దతు ధరలను పెంచింది. గత సంవత్సరంతో పోలిస్తే.. 150 నుంచి 200 అదనంగా పెంచారు. ఈ ధరలు 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు అమలులో ఉంటాయి. ఈ పంటల సాగుకు పెట్టుబడి తక్కువే.

- శాలురెడ్డి, ఏడీఏ

25న ఆలయ భూములకు వేలం

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖకు చెందిన భూములను ఈనెల 25న బహిరంగ వేలం ప్రక్రియ చేపడుతున్నామని కల్లూరు దేవదాయ శాఖ ఈవో గుర్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 145, 293 సర్వే నెంబర్లలో ఈశ్వర వీరభద్ర బీమేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన రెండు ఎకరాల భూమిని దేవదాయశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బహిరంగ వేలం టెండర్ ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. లక్ష రూపాయలు దేవస్థానం పేరుతో డీడీ రూపంలో చెల్లించాలని అన్నారు. ఎక్కువ మొత్తానికి వేలంపాటలో, ఈ టెండర్, సీల్డ్ టెండర్ ద్వారా కోట్ చేసినవారికి 11 సంవత్సరాల పాటు లీజు ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9603528537 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో బెదిరింపులు

● బియ్యం వ్యాపారి, డీఎస్పీపై నకిలీ అధికారుల చిందులు ● అనుమానం రావడంతో అదుపులోకి..

కర్నూలు క్రైం/ఓర్వకల్లు, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో కొంతమంది యువకులు శనివారం రచ్చ రచ్చ చేశారు. ఓ బియ్యం వ్యాపారికి ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. అనంతరం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీరా వారంతా నకిలీ మీడియా రిపోర్టర్లని గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన పాలకీటి మధుసూదన్, తాళ్లపల్లె గ్రామానికి చెందిన నీలం అంకిరెడ్డి, పాణ్యం మండలం మత్తూరుకు చెందిన పరదేశి రవికుమార్, నంద్యాల పట్టణానికి చెందిన కొరతాల మహేష్, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడుకు చెందిన ఆవుల మధులు ఒక ముఠాగా ఏర్పడి నకిలీ జర్నలిస్టులు, కేంద్ర అధికారుల గుర్తింపు కార్డులను తయారు చేసుకున్నారు. వీరందరూ నంద్యాల, కర్నూలులో నివాసం ఉంటూ నకిలీ విలేకరులుగా, అధికారులుగా చెలామణి అయ్యేవారు. ఈ ఐదుగురు కలిసి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు రాగమయూరి కాలనీలో బియ్యం వ్యాపారం చేసే బెస్త గంగాధర్ ఇంటికి వెళ్లారు. తాము కేంద్ర దర్యాప్తు సంస్థ కమిషన్ నుంచి వచ్చామని చెప్పారు. బియ్యం అక్రమ రవాణా చేస్తున్నావంటూ బెదిరించి రూ.5లక్షలు డిమాండ్ చేశారు. అయితే గంగాధర్ రూ.10 వేలు ఇవ్వడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. అక్కడి నుంచే కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్‌కు ఫోన్ చేశారు. 'మేము ఢిల్లీ నుంచి వచ్చిన జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇండియా.. నేషనల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ కమిషన్ సభ్యులమంటూ చెప్పుకొచ్చాడు. ఇక్కడ గంగాధర్ అనే వ్యక్తి బియ్యం పెద్ద ఎత్తున అక్రమ రవాణా చేస్తుంటే మీ పోలీసులు నిద్రపోతున్నారా' అంటూ డీఎస్పీపై చిందులు తొక్కాడు. ఇందుకు డీఎస్పీ స్పందిస్తూ 'మీరు నిజంగా కమిషన్ అయితే.. అలా నేరుగా రైడింగ్‌కు వెళ్లకూడదని, రెవెన్యూ అధికారులను గానీ, పోలీసులనుగానీ సంప్రదించి రైడింగ్ జరపాలని' సూచించాడు. దీంతో డీఎస్పీపై నిందితులు మరింత రెచ్చిపోయారు. 'మీపై ఢిల్లీ స్థాయిలో ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ముందు నువ్వు ఇక్కడకు రావాలంటూ' హుకుం జారీ చేశారు. డీఎస్పీకి అనుమానం రావడంతో అక్కడకు వెళ్లాలని కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడును ఆదేశించారు. దీంతో ఆయన ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వారిని ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా నకిలీ అధికారులు స్టేషన్‌లోని పుస్తకాలను చిందరవందర చేస్తూ 'ఢిల్లీ అధికారులంటే లెక్కలేదా..' అంటూ నానా హంగామా చేశారు. చివరికి వారి ఐడీ కార్డులు నకిలీవి అని నిర్ధారించుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో ఈ కేసు దర్యాప్తు చేయవద్దని, ఏదో తెలియక చేశారంటూ పెద్దఎత్తున పోలీసులకు ఫోన్లు వచ్చాయి.


నిందితుల అరెస్టు చూపుతున్న కర్నూలు డీఎస్పీ


నకిలీ ఐడీ కార్డులు, జర్నలిస్టు గుర్తింపు కార్డులు

● ఢిల్లీలో ఫార్చునర్ వాహనం కొనుగోలు

నిందితుడు ఢిల్లీలో ఫార్చునర్ వాహనం రూ.15 లక్షలకు కొనుగోలు చేసినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. అయితే ఢిల్లీ రిజిస్ట్రేషన్‌ను ఏపీ రిజిస్ట్రేషన్‌గా మార్చుకోకుండానే ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఢిల్లీ రిజిస్ట్రేషన్ అయితే ఎలాంటి అనుమానం రాదని ఇలాంటి వాహనం వాడుతున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. గతంలో కూడా బనగానపల్లెలో ఓ బియ్యం వ్యాపారి నుంచి రూ.1.15 లక్షలు నగదు వసూలు చేసినట్లు తేలింది. నిందితుల్లో ఒకడైన ఉప్పలపాడుకు చెందిన ఆవుల మధు బియ్యం వ్యాపారం చేస్తుంటాడు. జిల్లాలో బియ్యం వ్యాపారం చేసే ప్రధాన వ్యక్తులు కూడా మధుకు తెలుసు. ఇలా బియ్యం వ్యాపారం చేసే వారిని టార్గెట్ చేశారు. ఆవుల మధు కూడా గంగాధర్ వద్ద బియ్యం వ్యాపారం చేసేవాడు. గంగాధర్‌ను బెదిరిస్తే డబ్బులు వస్తాయనీ ప్రణాళిక రూపొందించింది ఆవుల మధునే కావడం కొసమెరుపు.





ఆర్‌యూ ప్రొఫెసర్‌కు మెమో

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ గత నెలలో తన పుట్టిన రోజు వేడుకలకు వసతి గృహాల్లోని విద్యార్థులను ఇంటికి పిలుచుకోవడం వివాదాస్పదమైంది. ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ బ్రాంచి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఈయన గతంలో నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కోవడంతో విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత వర్శిటీలో చేరినా ప్రవర్తన మార్చుకోలేదని కొందరు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వర్శిటీలోని రెండు వసతి గృహాల్లో వార్డెన్ల అనుమతి లేకుండా విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లడం వివాదాస్పదంగా మారింది. మహిళా వసతి గృహం నుంచి విద్యార్థినిలను పంపించకపోవడంతో వార్డెన్‌తో ఆయన వాగ్వాదానికి దిగాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి ఊటీ లాంటి విహార యాత్రకు పంపించాడనే మరో ఫిర్యాదు ఉన్నతాధికారులకు చేరింది. వర్శిటీలో కొందరు విద్యార్థులతో ఒక గ్యాంగ్‌ను ఏర్పాటు చేశాడని, కొందరు ప్రొఫెసర్లను టార్గెట్ చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. స్పందించిన ఉన్నతాధికారులు ఆయనకు మెమో జారీ చేస్తూ.. ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణకు కమిటీ వేశారు. కమిటీ నివేదిక ప్రకారం చర్యలు ఉంటా యని, వర్శిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు వద్ద ప్రస్తావించగా కొత్తగా వచ్చానని, తెలుసుకుని స్పందిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి సమష్టిగా పని చేయాలి


కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు బి.లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శనివారం నంద్యాలలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డోన్, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల కార్యకర్తల సమీక్షాసమావేశం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయినుంచి జిల్లా స్థాయి, నియోజకవర్గ, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకును పెంచుకునే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 2029లో భారతదేశ ప్రధానిగా రాహుల్‌గాంధీని చేసే విధంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. నియోజకవర్గాల నాయకులు మద్దిలేటిస్వామి, జనార్దన్, సుబ్బుయాదవ్, వడ్డె రాజశేఖర్, రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరుడి భూ కబ్జా

- రూ.1.50 కోట్ల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు


కబ్జాకు గురైన స్థలం


బాధితుడు హరీశ్‌బాబు

ఆదోని /కర్నూలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అనుచరుడు, డెంటిస్ట్ డాక్టరు రవికిరణ్ భూ కబ్జాకు పాల్పడి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని బాధితుడు ఎంకే హరీశ్‌బాబు ఆరోపించారు. నిందితులపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన వెల్లడించారు. బాధితుడి కథనం మేకు.. ఆదోని పట్టణం మండిగిరి గ్రామం సర్వే నంబరు 379/బి, 380ఏ పరిధిలోని శ్రీకృష్ణదేవ రాయ నగర్ కాలనీలో ఉన్న ఎల్‌పీ నంబరు 3/83 లేఅవుట్‌లో 300 చదరపు అడుగుల (దాదాపు ఆరు సెంట్లు) స్థలం ఉంది. ఈ స్థలాన్ని హరిశ్‌బాబు తల్లి కురువ హనుమంతమ్మ 1984 నవంబరు 28న కొనుగోలు చేసింది. ఈ మేరకు ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబరు 3359/1984 కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 40 ఏళ్లుగా ఆ స్థలం వీరి ఆధీనంలోనే ఉంది. ప్రస్తుతం వీరు కర్నూలులో ఉంటున్నారు. అయితే వీరు స్థానికంగా లేరని గుర్తించిన డెంటిస్ట్ డాక్టర్ రవికిరణ్ ఆయన తల్లి జె.లక్ష్మి ఫొటోతో కురువ అనుమంతమ్మ పేరిట నకిలీ ఆధార్ కార్డు సృష్టించాడు. అనంతరం సమీప బంధువు చిప్పల సురేశ్‌బాబు పేరిట ఈ నెల 16న ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న హరీశ్‌బాబు ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారించడంతో నకిలీ ఆధార్ కార్డు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీంతో డాక్టర్ రవికిరణ్, ఆయన తల్లి జె.లక్ష్మి, చిప్పల సురేశ్‌బాబులపై బాధితుడు డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై సబ్ రిజిస్ట్రార్ అజిమియా, డాక్టర్ రవికిరణ్‌ల వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కాల్వలో దొంగల బీభత్సం

● నాలుగు ఇళ్లలో చోరీ ● బంగారు, నగదు అపహరణ

ఓర్వకల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాల్వ గ్రామం బస్టాండు సమీపంలోని కొత్త బిల్డింగులో శనివారం తెల్లవారు జామున దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని నాలుగు ఇళ్లలో తలుపులు పగులగొట్టి రూ.8 లక్షల విలువైన ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ గ్రామాన్ని సందర్శించి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కుమార్తె వివాహం కోసం బీరువాలో దాచుకున్న రూ.3 లక్షల నగదుతోపాటు ఐదు తులాల బంగారు నగలను అపహరించారు. అలాగే వెంకటసుబ్బమ్మ అనే ఒంటరి మహిళ ఇంట్లో చొరబడి రూ.40వేలు, జాకీర్‌బాషా, దేశాయినూర్ ఇళ్లలో బంగారు కమ్మలు, జింకీలతో పాటు కొంత నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడలిని హత మార్చిన మామ అరెస్టు

నందికొట్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోడలిని చంపిన కేసులో మామతోపాటు మరో నలుగురిని అరెస్టు చేశామని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామానికి చెందిన శిరీషను ఆమె మామ కురుమన్న శుక్రవారం బండరాయితో బాది చంపాడని చెప్పారు. ఈ కేసులో కురుమన్నతోపాటు, శిరీష అత్త శేషమ్మ, భర్త నరసింహులు, ఆడపడుచులు మల్లేశ్వరి, వేనమ్మలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితులను విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిరీష హత్యతో అభం శుభం తెలియని చిన్నారులు పావని, నవదీప్‌లు తల్లిలేని పిల్లలయ్యారు.



పోలీసు స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న శిరీష బంధువులు, దీనంగా ఉన్న శిరీష పిల్లలు పావని, నవదీప్

పోలీసుస్టేషన్ ముట్టడి : పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తమకు అప్పగించాలంటూ శిరీష కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసుస్టేషన్ ముందు నిరసన చేపట్టారు. నిందితులను ఆరోగ్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లే సమయంలో ఒక్కసారిగా స్టేషన్ గేట్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. నిందితులను తమకు అప్పగించాలని పట్టుబట్టడంతో పోలీసులు వారిని శాంతింపజేసి నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చేస్తామని భరోసా ఇచ్చారు.

మంత్రి పేరుతో వేధింపులు!

- సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన బాధితులు
- విచారణకు ఆదేశించిన మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని ట్రాఫిక్ పట్టణ పోలీసు లైన్ మసీదుకు సంబంధించి బాడుగదారులను మంత్రి టీజీ భరత్ పేరు చెప్పి కొందరు వ్యక్తులు వేధింపులకు గురిచేస్తున్నారు. అద్దె ఎక్కువగా ఇవ్వాలంటూ దౌర్జన్యం చేస్తున్నట్లు బాధితులు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి నగర పాలక కమిషనర్‌కు లేఖ వచ్చింది.

నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపం లోని మసీదుకు సంబంధించి దుకాణాలలో ఏళ్ల తరబడి కొందరు వ్యాపారాలు చేసు కుంటున్నారు. ప్రతి నెలా అద్దె చెల్లించడంతో పాటు మున్సిపల్ పన్ను కూడా సక్రమంగా చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక చట్ట విరుద్ధంగా కొత్తగా కమిటీ వేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాడుగదారులు సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటయిన వెంటనే మంత్రి చెప్పారని, బాడుగ పెంచాలని డిమాండ్ చేసినట్లు బాధితులు లేఖలో ప్రస్తావించారు. ప్రతి దుకాణానికి ఎన్నడూ లేని విధంగా కొలతలు వేయడంతోపాటు కొత్తగా దుకాణాలకు నెంబర్లు కూడా వేసినట్లు తెలిపారు. మంత్రి పేరును వాడుకుని కొందరు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు సీఎంకు పంపిన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు కమిటీలో మంత్రి దగ్గర పని చేస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్ షేక్ యూనుస్ బాషా, ఇతడి బాబాయి షేక్ హుసేన్‌బాషా, బావమరిది షేక్ ఇస్మాయిల్‌తో పాటు మసీదుకు సంబంధం లేని ఇద్దరిని కలిపి మొత్తంగా ఐదుగురితో కమిటీ వేశారన్నారు.

ఇదిలా ఉండగా ఈ అంశంపై నగరపాలక సంస్థ అధికారులు విచారణ చేపడుతున్నారు. తన పేరును వినియోగించి ఎవరైన అతిగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటా యని ఇటీవల మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరిస్తే ఎంతటివారైనా సరే విచారించి చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే.

పిడుగుపాటుతో మహిళ మృతి


మంజుల (ఫైల్)

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 19: మండలంలోని అనుగొండలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన బాలమద్దిలేటి భార్య మంజుల (35), మరో నలుగురు పొగాకు పొలంలో కలుపుతీత పనులకు వెళ్లారు. సాయంత్రం మరో గంటలో ఇంటి ముఖం పట్టే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. ఆ సమయంలో అకస్మాత్తుగా పెద్ద శబ్దం రావడంతో మహిళలందరూ పొలంలో పడుకున్నారు. శబ్దం తీవ్రత తగ్గిన తర్వాత మహిళలు పైకి లేచి కూర్చున్నారు. అయితే మంజుల స్పందించక పోవడంతో మిగతా కూలీలు హుటాహుటిన గ్రామం లోకి చేర్చారు. మంజులను వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగి పోయారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

ప్రేమోన్మాది వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

ఆస్పరి, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని నగరూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు యువతిని ప్రేమించమని గత కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. తన ప్రేమను యువతి తిరస్కరిస్తూ వచ్చింది. అయినా యువకుడు వినకుండా అమ్మాయిని వేధింపులకు గురి చేస్తూ శుక్రవారం యువత కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఇంటికి వెళ్లి తనను ప్రేమిస్తావా లేదా చస్తావా, చంపాలా అని భయ భ్రాంతాలకు గురి చేయడంతో తీవ్ర అసంతృప్తికి గురై యువతి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. యువతి తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లి మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. అపాస్మరక స్థితిలో ఉన్న ఆమెను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ఘటనలో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వెంకటరమణకాలనీలో సత్యవేదమ్మ(28) ఇంట్లో దుస్తులు ఉతుకుతూ మోటారు వేసేం దుకు ప్లగ్‌ను సాకెట్‌లో పెటింది. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు గుర్తించారు. భర్త గిరిబాబు ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈమెకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

పనిచేస్తూ ఎలక్ట్రీషియన్..

ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంట్లో పని చేస్తుం డగా ముత్తు (19) అనే ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. బండిమెట్టకు చెందిన ముత్తు ఎలక్ట్రికల్ పని చేస్తుంటాడు. శనివారం సాయంత్రం బిల్డింగులో ఎలక్ట్రికల్ పని చేస్తుండగా.. ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

నిందితులను శిక్షించాలి : సీపీఐ


పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శిరీష హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరులోని పటేల్ సెంటర్‌లో సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కోడలు శిరీషపై మామ అత్యంత కిరాతకంగా బండరాయితో ఆమె తలపై బాది హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేపట్టి, కురుమన్నను కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు శంకర్ నాయుడు, ఉస్మాన్ భాషా, నాగస్వాములు, ప్రతాప్, రాము, ఏపీ మహిళా సమాఖ్య నగర నాయకురాలు సులోచనమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : హిందూపురంలో ఉపాధ్యాయులకు నిర్వహించే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలి, లేదా జిల్లా కేంద్రాలలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం సుదూర ప్రాంతమైన హిందూపురంలో శిక్షణ నిర్వహించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు భోధనపరంగా నష్టం వాటిల్లుతుందన్నారు. శిక్షణను వాయిదా వేయాలని లేనిచో నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలో మండల కేంద్రాలలో గాని జిల్లాకేంద్రాలలో గాని నిర్వహించాలని కోరారు. సమావేశంలో రామచంద్రారెడ్డి ,జిల్లా ప్రదానకార్యదర్శి శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, రంగనాయకులు, గాలయ్య, నౌమాన్‌భాషా పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన మెజిస్ట్రేట్

ఆత్మకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని బాలుర, బాలికల వసతి గృహాలను శనివారం ఆత్మకూరు సీనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ వెంకటేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాల గురించి వార్డెన్ అమ్మనిబాయిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

విద్యార్థి హక్కుల కోసం ఉద్యమించాలి

నంద్యాల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో అందరికీ సమాన విద్య అందాలని విద్యార్థి హక్కులకై పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి రాంబాబు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 24న హైదరాబాద్‌లోని ఉస్మానియాయూనివర్సిటీలో, నవంబర్ 5నవిజయవాడలోని మాకినేని బసవపున్నయ్య కేంద్రంలో జరిగే సభలను జయప్రదం చేయాలని కోరారు. శనివారం సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు చంటి, బాలు, దస్తగిరి, మహేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

బండిఆత్మకూరు, అక్టోబర్ 12(ఆంధ్రజ్యోతి): పంచాయితీల అభివృద్ధిలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాలుపంచుకోవాలని ఎంపీడీవో దస్తగిరి సూచించారు. శనివారం శిక్షణ ముగింపును పురస్కరించుకుని ఎంపీడీవో మా ట్లాడుతూ విధులు, నిధులుపై అవహగాన ఉండాలని, గ్రామాల అభివృద్ధికి కీలకపాత్ర పోశించాలని కో రారు. కార్యక్రమంలో ఏవో శ్యామల పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మహానంది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి పరిశీలించారు. మండలంలోని యి.బొల్లవరం,తమ్మడపల్లి,నందిపల్లి పొలాల్లో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులకు సూచనలు ఇచ్చారు. నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి చంద్రశేఖర్, వీఆర్వో మాధవరావులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

జూపాడుబంగ్లా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన 68వ జిల్లా స్థాయి వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని యు. అక్షయ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి ఉపాధ్యాయ బృందం అభినందించారు.

చెత్త కష్టాలకు శాశ్వత పరిష్కారం

- వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం నిర్వహణకు శ్రీకారం
- చెత్త తరలించేందుకు వీలుగా రహదారి ఏర్పాటు
- ఇదే జరిగితే పట్టణంలో మెరుగైన పారిశుధ్యం

ఆత్మకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణాన్ని దశాబ్దాల కాలంగా వేధిస్తున్న చెత్త కష్టాలు తీరనున్నాయి. పట్టణంలో ప్రతిరోజు వెలువడే చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను డంపింగ్ చేసేందుకు సరైన డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తనిల్వలే దర్శనమిచ్చేవి. అయితే కొంతమేర చెత్తనిల్వలను మున్సిపల్ సిబ్బంది పట్టణానికి దూరంగా తరలిస్తున్నప్పటికీ సేకరించిన చెత్తను ఎక్కడా డంప్ చేసేందుకు ఆస్కారం లేకపోవడంతో శ్రీశైలం, కొత్తపల్లి, వడ్లరామాపురం, సిద్దేపల్లి తదితర రోడ్ల పక్కనే వదిలి నిప్పంటించేవారు. దీనివల్ల ఆయా గ్రామాలకు వెళ్లేవారికి తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈక్రమంలో చేసేది ఏమీ లేక కొంతకాలం పట్టణ శివార్లలోని భవనాశిలో, ఇతర నీటికుంటల ప్రదేశాల్లో కూడా చెత్తను నిల్వ చేసేవారు. అయితే చెత్తనిల్వలతో భవనాశి నది కలుషితమవ్వడంతో మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు వచ్చాయి. ఈక్రమంలోనే పాములపాడు మండలంలోని భానుకచెర్ల సమీపంలో అటవీ ప్రాంతంలో చెత్తను డంపింగ్ చేయాలని ప్రయత్నించినప్పటికీ అక్కడి గ్రామస్థులు అడ్డుకున్నారు. కాగా 2017లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ సమస్యను గుర్తించి డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం ఎస్పీజీ పాలెం సమీపంలో రూ.50లక్షలతో ఐదెకరాల భూమిని కొనుగోలు చేసినప్పటికీ అక్కడికి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఇంతవరకు సమస్యకు పరిష్కారం లభించలేదు. దీనికితోడు చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్లు దళితవాడల మీదుగా వెళ్లాల్సి ఉండటంతో అందుకు వారు సైతం అభ్యంతరాలు తెలిపారు. అయితే ఐదు ఎకరాల ప్రదేశంలో డంపింగ్ యార్డుకు బదులు వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు భావించారు. అంతేకాదు అక్కడికి చెత్త తరలించేందుకు ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. ఇదే జరిగితే పట్టణ ప్రజలకు చెత్త కష్టాలకు పరిష్కారం లభించనుంది.


రహదారిని ఏర్పాటు చేస్తున్న అధికారులు

పట్టణ పారిశుధ్యంపైనే ప్రత్యేక దృష్టి



ఆత్మకూరు పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న చెత్త సమస్యను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాము. గతంలో డంప్ యార్డు కోసం కొనుగోలు చేసిన ఐదు ఎకరాల మున్సిపాలిటీ ప్రదేశంలో డంపింగ్ యార్డుకు బదులు వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇక్కడ ఆదునిక పద్ధతులతో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువు తయారీతో సంపదను సృష్టించేలా చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా సమీప కాలనీల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు.

- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

చెత్త తరలించేందుకు రహదారి ఏర్పాటు

ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్‌బాబు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డంపింగ్ యార్డు ప్రదేశానికి చెత్తను తరలిస్తే పట్టణంలో మెరుగైన పారిశుధ్యాన్ని అందించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునన్న బావనతో డంపింగ్ యార్డు రహదారి సమస్యను పరిష్కరించే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచన మేరకు చెత్తను తరలించే వాహనాలు దళిత వాడల మీదుగా కాకుండా పట్టణానికి దూ రంగా తీసుకెళ్లేలా నిర్ణయించారు. ఇందుకోసం చిన్నవాగుపై పైపులతో కూడిన వంతెన నిర్మాణంతో పాటు అక్కడికి చెత్తను తరలించే వాహనాలు వెళ్లేందుకు రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి సుమారు రూ.15లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లోగా ఆపనులను పూర్తిచేసేలా మున్సిపల్ అధికారులు వేగవంతంగా చర్యలు చేపడుతున్నారు. ఇదే జరిగితే సమీప కాలనీల వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలుస్తోంది.


వడ్లరామాపురం రస్తా పక్కన చెత్త నిల్వలు

పేదల కడుపు కొట్టిన జగన్ : ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరులో అన్న క్యాంటీన్ ప్రారంభం

ఆత్మకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిన దుర్మార్గుడని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. శనివారం ఆత్మకూరులోని పాతబస్టాండ్‌లోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అక్షయపాత్ర సంస్థ సహకారంతో అన్న క్యాంటీన్‌లో ఉదయాన్నే సిద్ధంగా ఉంచిన రూ.5కే అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతో పేదలకు, రైతు కూలీలకు, కార్మికులకు ఉపయోగపడే అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. మంచి పాలన చేస్తున్న తమ ప్రభుత్వానికి మరిన్ని సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వైసీపీ నేతలు దిగజారుడు విమర్శలు చేయడం సరికాదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు కలిముల్లా, రాజారెడ్డి, వెన్నా శ్రీధర్‌రెడ్డి, తిమోతి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ తదితరులు ఉన్నారు.


అన్నక్యాంటీన్‌లో అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

- శ్రీశైలం దేవస్థానం ఇంచార్జ్ ఈవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు శనివారం ఆత్మకూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే బుడ్డాను ఆయన కలిసి శ్రీభ్రమరాంబమల్లికార్జున స్వామి అమ్మవార్ల జ్ఞాపికతో పాటు ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు.
- ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ క్రీడలు విజయవంతం కావడాన్ని హర్షిస్తూపాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పీఈటీ దేవానంద్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శివకుమార్ శనివారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆత్మకూరు క్లస్టర్ టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని పాలెంచెరువు గూడెం గిరిజన పాఠశాల ఆవరణలో విద్యార్థులతో పాటు స్థానిక గిరిజనులకు టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రవి కుమార్ మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే.. సమీపంలోని వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శైలజ, హెల్త్ అసిస్టెంట్ సరిత, ఉపాధ్యాయులు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగాకుతో రోగ నిరోధక శక్తి

మహానంది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మునగాకును తీసుకోవడం వల్ల మహిళల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ టీచర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. శనివారం మహానంది మండలం గోపవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామంలోని యుక్త వయస్సు బాలికలతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, పోషక విలువలు గల ఆహార పదార్థాలు తీసుకోవాలనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. అంతకుముందు హాజరైన మహిళలతో పాటు చిన్నారులతో మునగాకుతో పాటు ఆకుకూరలతో ప్రదర్శించారు.

క్యాన్సర్ నిర్ధారణకు స్ర్కీనింగ్ పరీక్షలు

నంద్యాల రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ నిర్ధారణకు స్ర్కీనింగ్ పరీక్షలను నవంబరులో నిర్వహిస్తున్నట్లు చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ షహాశం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధితో భయపడాల్సిన పని లేదని, ముందస్తుగా గుర్తించి తగిన వైద్యం పొందితే ఆరోగ్య జీవితాన్ని పొందవచ్చునన్నారు. క్యాన్సర్‌ను నిర్మూలించడానికి నేడు అదునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిడుతూరు, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామ సమీపంలోని బ్రహ్మంగారి మఠం వద్ద నందికొట్కూరు నుంచి ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను ఎస్ఐ ఓబులేసు పట్టుకున్నాడు. ఆటోలో ఉన్న 9 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్ మౌలాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాభివృద్ధే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే

పాములపాడు, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, అందులో భాగంగా పల్లెపండుగలో భాగంగా పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగూడూరులో చెల్లె హరినాథరెడ్డి, భానుముక్కలలో బండ్లమూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 10 పంచాయతీలలో రెండుకోట్ల 65 లక్షలతో 43 సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ సుబ్రమ్మ, టీడీపీ నాయకులు సురేంద్రనాద్‌రెడ్డి, ఆళ్ళగడ్డ హరిసర్వోత్తమరావు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, మధుక్రిష్ణ, మంగమ్మబాయి లింగేశ్‌గౌడ్ మల్లీశ్వరరెడ్డి, స్వాములు, ఉన్నం రాముచౌదరి, జనసేన రాము, శంకర్‌స్వామి, పూసలక్రిష్ణ, హఫీజ్, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, బాలస్వామి, నబీరసూల్ పాల్గొన్నారు.

- మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఉచితంగా మినుములను రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి పణీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు


ఎర్రగూడూరులో భూమి పూజ చేస్తున్నఎమ్మెల్యే


తిమ్మనపల్లిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా


చిన్నదేవళాపురంలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

బండిఆత్మకూరు: టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు సురేష్‌రెడ్డి, శంకర్, లింగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్న దేవళాపురం గ్రామంలో అభివృద్ధి పనులకు సర్పంచ్ ఆవులపాటి మధుసూదన్ చౌదరి, ఎంపీడీవో దస్తగిరి ఆధ్వర్యంలో వారు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. పీఆర్ ఏఈ వెంకటరామడు, సూపర్‌వైజర్ రమాదేవి, రాముడు, బాబు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పల్లె పండుగతోనే పల్లెసీమలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు శివారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్ద గుమ్మడాపురం, పాతమాడుగుల గ్రామాల్లో పల్లె ఎంపీడీవో మేరీ సీసీ రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో పీఆర్ ఏఈ మద్దిలేటి, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, బాల ఎల్లయ్య, ఎంపీటీసీ శివన్న, ఉప సర్పంచ్ బొల్లు శ్రీనివాసులు, నాయకులు బుచ్చిరెడ్డి, జడ్ వెంకటరెడ్డి, మల్లయ్య, శీలం లింగన్న, డీలర్ వెంకటస్వామి, సుబ్బరాయుడు, డా.రాము, రాధాకృష్ణారెడ్డి, దరగయ్య, రహీంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గడివేముల, : పల్లె పండుగతోనే గ్రామాలభివృద్ధి చెందుతాయని మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని గడిగరేవుల, కె.బొల్లవరం గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

పల్లెపండుగతో గ్రామాల అభివృద్ధి

వెలుగోడు, అక్టోబరు 19: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే టీడీపీ ధ్యేయమని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మనపల్లి, బోయరేవుల, వెలుగోడు, గుంతకందాల గ్రామాలలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన గ్రామాలలో రహదారులు, మురికి కాల్వల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు శేషిరెడ్డి, ఖలీల్, కలాం, ఒమిన్ రసూల్, జాకీరు హుస్సేన్, ఎల్లాల క్రిష్ణుడు, రామనాయుడు, జనసేన నాయకులు శాలు బాషా, బిజెపి నాయకులు నాగేశ్వరరావు, వివిధ శాఖల మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు

నంద్యాల రూరల్: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా ప్రదానకార్యదర్శి ఫిరోజ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మిట్నాల, గుంతనాల గ్రామాలలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని సీసీ రహదారులు, డ్రైనేజిల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గుంతనాల సర్పంచ్ నాగేశ్వరరావు, టీడీపి మండల కన్వీనర్ విశ్వనాదరెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు శీలం రాజేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, చిలుకూరి రవిచౌదరి, పాల్గొన్నారు.

పాణ్యం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సాంబవరం, కానాలపల్లె, గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టారు. టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎంపీడీవో అమానుల్లా, తహశీల్దారు షేక్ మొహిద్దీన్, టీడీపీ నాయకులు జూపల్లె రామగోపాల్‌రెడ్డి, శీను, చంద్రశేఖరరెడ్డి, రమణారెడ్డి, ఉశేన్ సా పాల్గొన్నారు.

సీఎంకు చెక్కు అందజేత


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి రూ.32 లక్షల చెక్కును అందజేశారు. శనివారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కోట్ల కలిసి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే వెంట తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ నాయకులు శ్రీనివాసభట్టు ఉన్నారు.

టీడీ జనార్దన్‌రెడ్డిని కలిసిన సుబ్బారెడ్డి

డోన్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్ర మంలో డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్ ఉన్నారు.


టీడీ జనార్దన్‌కు బొకే అందిస్తున్న సుబ్బారెడ్డి

సేవలోనే తృప్తి : సీజీఎం


వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సీజీఎం మల్లికార్జునరెడ్డి, ఏజీఎం కోటేశ్వరరావు

ప్యాపిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవలు అందించడంలో ఎంతో తృప్తి ఉంటుందని ప్రియా సిమెంట్స్ సీజీఎం మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాచెర్ల ప్రియా సిమెంట్స్ పరిశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా పరిశ్రమంలోని ఆస్పత్రి ద్వారా రోజు పేదలకు వైద్యం అందిస్తున్నామన్నారు. అలాగే ఉన్నతమైన ప్రమాణాలతో పేద విద్యార్థులకు ఉచిత విద్యను కూడా అందిస్తున్నామన్నారు. అనంతరం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి చెందిన వైద్యులు దాదాపు 835 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీజీఎం ఆనందభాస్కర్, ఏజీఎం కోటేశ్వరావు, సాంబశివరావు, డాక్టర్ సరోజిని పాల్గొన్నారు.

చేతి పంపు నీరే శరణ్యం

రుద్రవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు ప్రాథమిక పాఠశాలలో లక్షలాది రూపాయలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. అయినా చేతిపంపు నీరే శరణ్యమైంది. మినరల్ వాటర్ ప్లాంటు నీరు వాసన వస్తోందని ఉపాధ్యాయులు అంటున్నారు. దాంతో విద్యార్థులకు పాఠశాలకు సమీపంలో ఉన్న చేతిపంపు నీరు తెప్పించి బిందెల్లో ఏర్పాటు చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంటు రక్షిత నీరు విద్యార్థులకు అందడంలేదు. ఈ విషయంపై హెచ్‌ఎం మునిశంకర్ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంటు నీరు వాసన వస్తుంది, అందుకే విద్యార్థులకు చేతిపంపు నీరు బిందెల్లో ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రుద్రవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఆదర్శ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 18న నంద్యాలలో జరిగిన అండర్ 14, అండర్ 17 విభాగాల్లో విలువిద్య పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా రన్నారు. అండర్ 14 విభాగంలో బాలాజీ, అండర్ 17 విభాగంలో చరిత, సుప్రజ, అలేఖ్య, రాఘవేంద్ర ఎంపికయ్యారన్నారు. మణ్యం పార్వతీపురం జిల్లాలో నవంబరు 3 నుంచి 5వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

రుద్రవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యల్లావత్తుల గ్రామానికి చెందిన పార్థ శేఖర్ రుద్రవరంలోని కాశీ విశ్వేశ్వర ఆంజనేయస్వామి లక్ష్మీవేంకటేశ్వర దేవాలయం అభివృద్ధికి రూ.25116 విరాళం అందించినట్లు ఆలయ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి శనివారం తెలిపారు. ఆయనను పూలమాల, శాలువాతో ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.క్రిష్ణమూర్తి, పోలయ్య పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సంజామల, అక్టోబరు 19: వర్షాలకు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్ కుమార్ కోరారు. శనివారం ముదిగేడు, ముక్కమళ్ల మధ్య ప్రవహి స్తున్న పాలేరు వాగును ఆయన పరిశీలించారు. వాగు ఉధృతికి వా హనాల రాకపోకలను నిలిపివేయాలని పోలీసులకు సూచించారు. వాగు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ వెంగళ్ రెడ్డి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తాపించాలి

ఉయ్యాలవాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పసరిగా తాపించాలని పశువైద్యాధికారి శ్రీలక్ష్మి తెలిపారు. శనివారం ఇంజేడు గ్రామంలో 50 మేకలకు మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో మేకలకు, గొర్రెలకు నట్టలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు తాపించాలన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

- మొలకెత్తిన మొక్కజొన్న ధాన్యం
- కూలిన మట్టిమిద్దె
- ఆందోళనలో రైతులు


చాగలమర్రిలో ప్రవహిస్తున్న అడ్డవాగు


రుద్రవరం మండలం డి.కొట్టాల సమీపంలో నేలవాలిన వరి పైరు


చాగలమర్రి సర్వీసు రహదారిలో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం పట్టాపై నిలిచిన వర్షపునీరు

చాగలమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలతో రైతులు అతలాకుతలమయ్యారు. శుక్రవారం వర్షం కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం మళ్లీ వర్షం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రైతుల ఆశలు అడియా శలయ్యాయి. చాగలమర్రిగ్రామ సమీపంలోని అడ్డవాగు పొంగి ప్రవహించి పంట పొలాల్లో ప్రవహించింది. మొక్కజొన్న, కంది, పత్తి, జొన్న తదితర పంటలు వరద నీరు తగ్గక ముందే తిరిగి వరద నీరు ప్రవహించడంతో రైతులు కుదేలయ్యారు. చేతికొచ్చిన పంటలు తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినడంతో రైతుల కంట కన్నీరు తెప్పించింది. చేతి కొచ్చిన మొక్కజొన్న పంట నూర్పిడి చేసి రహదారుల వెంట ఆరబెట్టుకున్న సమయంలో అకాల వర్షంతో అపార నష్టం మిగిల్చింది. మొక్కజొన్న ధాన్యంపై పట్టలు కప్పిన మొలకలు వచ్చి రంగు మారాయి. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు విలపించారు. ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఆవులపల్లె గ్రామంలో చిన్నమ్మకు చెందిన మట్టిమిద్దె కుప్పకూలింది. ఇంటిలో ఎవరు లేని సమయంలో మట్టిమిద్దె కూలడంతో ప్రమాదం తప్పింది. ఆస్తి నష్టం సంబవించింది. పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

రుద్రవరం: తుఫాను గాలులకు మండలంలోని డి.కొట్టాల, పెద్దకంబలూరు, యల్లావత్తుల, కోటకొండ గ్రామాల వరి పైరు నేలకువాల్లింది. పంటలు చేతికందే సమయంలో తుఫాను దెబ్బతో అపార కష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకంకులతో ఉన్న వరి పంట నేలవాలడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలోని లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు నిత్యపూజ, హోమ మండపంలో సాంప్రదాయబద్ధంగా హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి, తీర్థప్రసాదగోష్ఠి నిర్వహించారు. పూజా కైంకర్యాల్లో జరిగిన తప్పులను మన్నించాలని, లోకం సుభిక్షంగా ఉండాలని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణి యార్ సౌమ్య నారాయణన్ పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

నారసింహుడికి ప్రత్యేక పూజలు

శిరివెళ్ల, అక్టోబరు : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో వెలసిన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజా మునే స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.


స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బాలికల కళాశాల, హాస్టల్ తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయాధికారి షేక్ అబ్దుల్‌రహిమాన్

కోవెలకుంట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని, బాలికల జూనియర్ కళాశాల, హాస్టల్‌ను న్యాయాధికారి షేక్ అబ్దుల్‌రహి మాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనాలు అందించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని విద్యార్థినులకు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాసులు, కళాశాల, హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులు జాగ్రత్తలు పాటించాలి

- ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి



డోన్ రూరల్, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డోన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: రైతులు ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు వేశారు..?

జవాబు: సబ్ డివిజన్ పరిధిలో రైతులు 75 వేల ఎకరాల్లో కంది, 15 వేల ఎకరాల్లో వేరుశనగ, ఐదు వేల ఎకరాల్లో ఆముదం పంటలు వేశారు.

ప్రశ్న: డోన్ సబ్ డివిజన్ పరిధిలో ఏయే పంటలు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి..?

జవాబు: డోన్ సబ్ డివిజన్ పరిధిలో కంది, వేరుశనగ, ఆముదం పంటలు పూత దశలో ఉండి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి.

ప్రశ్న: పంటలు కాపాడుకునేందుకు రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

జవాబు: అల్పపీడన ప్రభావంతో కురిసే వర్షాల వల్ల వచ్చే నీరు పంట పొలాల్లో చేరితే.. కాలువల ద్వారా వాటిని వెంటనే తొలగించాలి. కంది పంటకు మొక్క పొదల్లో ఒక ఎకరాకు 20 కేజీల యూరియే అందించే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలి. వేరుశనగ, ఆముదం పంటలకు బూజు వచ్చే ప్రమాదం ఉందని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చాగలమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఏవో రంగనేతాజీ పరిశీలించారు. శనివారం గొడిగనూరు, శెట్టివీడు, చింతలచెరువు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము, మొక్కజొన్న, కంది పంట పొలాలను పరిశీలించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పంట నష్టం జరిగిన రైతులు ఆర్‌బీకేలలో పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట వీహెచ్ఏలు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొలిమిగుండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేట్నీకోట గ్రామంలో రామాలయం సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు శనివారం వెల్లడించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.4,140 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్

మండలంలోని బెలుం గుహల సమీపంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న బెలుం గ్రామానికి చెందిన కోట సూర్యనారాయణరెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు శనివారం తెలిపారు. అతడి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడులు

బేతంచెర్ల అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామ పరిసర ప్రాంతాల్లోని కొండల్లో నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు శనివారం విస్తృత దాడులు చేశారు. మూడు చోట్ల సారా తయారీ చేస్తున్న బట్టీలను ధ్వంసం చేసి 650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య, హెడ్ కానిస్టేబుల్స్ వెంకటనారాయణ, షేక్షావలి తెలిపారు. బుగ్గానిపల్లె తండా గ్రామానికి చెందిన దసేవత్ స్వామి నాయక్, దళావత్ దేవా నాయక్, మినావత్ రాంలి బాయ్‌ని అదుపులోకి తీసుకుని డోన్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

కొలిమిగుండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా శనివారం కొలిమిగుండ్లలోని పుట్లూరు చంద్రశేఖరరెడ్డికి చెందిన మట్టి మిద్దె కూలింది. ఆసమయంలో ఆయన పక్క రూములో పడుకొని ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని బాధితుడు వాపోయాడు. ఇంటితో పాటు, ఇంట్లో సామాన్లు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

మట్టిమిద్దెల వివరాలను సేకరించాలి

చాగలమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న మట్టిమిద్దెల వివరాలను సేకరించాలని తహసీల్దార్ రవికుమార్ వీఆర్వోలను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ యన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 18 మట్టిమిద్దెలు, రెండు రేకుల షెడ్లు కూలిపోయాయని తెలిపారు. కూలిన మట్టిమిద్దెల వివరాలను సేకరించి నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. సమావేశంలో డీటీ విజయ్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి: ఈఈ

రుద్రవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఈఈ హరిగోపాల్ అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని నరసాపురం, నాగలవరం, రుద్రవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద గృహం ప్రారంభానికి రూ.ఐదు వేలు బేస్‌మెట్టం నిర్మించుకున్న వారికి రూ.40వేలు అడ్వాన్సు నిధులు వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. గృహాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. డీఈ విజయబాబు, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఆనంద్, ప్ర సాద్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

కొలిమిగుండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటిక రహదారికి మరమ్మతులు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ శివ శనివారం తెలిపారు. శ్మశాన వాటిక రహదారిలో ఎర్రవాగు వద్ద దిగడానికి తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఉండటంతో మెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో మృతదేహాలను తీసుకెళ్లడానికి ఇబ్బందులు తొలగినట్లు సర్పంచ్ శివ తెలిపారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

డోన్ రూరల్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామగానిగుంట్ల గ్రామ సమీపంలో శనివారం ఉల్లి పంట కోత ప్రయోగాన్ని ఉద్యాన శాఖ అధికారి జి.కళ్యాణి పరిశీలించారు. గ్రామానికి చెందిన రామిరెడ్డి పొలంలో జరిగిన పంట కోత ప్రయోగంలో దిగుబడి తొమ్మిది కేజీల 150 గ్రాములు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సాగు సమయానికి సబ్సిడీ శనగ విత్తనాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు సమయానికే ప్రభుత్వం సబ్సిడీ శనగలు అందజేస్తోందని టీడీపీ నాయకులు కోరుమానుపల్లె నరసింహారెడ్డి, ఉమ్మాయిపల్లె గోపాల్‌రెడ్డి, ఆదినారాయ ణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తోళ్లమడుగు రైతు సేవా కేంద్రంలో వీఏఏ సందీప్ ఆధ్వర్యంలో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో రమణయ్య, నరసింహారెడ్డి, విశ్వనాథరెడ్డి, అశ్వర్థరెడ్డి, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం

చాగలమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు సామూహికంగా లలితా పారా యణం భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. వీరాంజనేయ, పట్టాభిరామ ఆలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. సంజీవరాయస్వామికి మహిళలు తమలపాకులతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో నర్సయ్య, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.50 వేల చెక్కు అందజేత

బేతంచెర్ల అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.50వేలు చెక్కును శనివారం అందజేశారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో టీడీ జనార్దన్ రెడ్డికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏవీ సుబ్బారెడ్డిని అభినందించారు.

డిగ్రీ కాలేజీ అధ్యాపకుడికి డాక్టరేట్

డోన్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ లెక్చరర్ చంద్రశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. రాయలసీమ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలస్థాయిలోని విద్యార్థినులకు క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశాలు, అవరోధాలు అనే అంశంపై ఆచార్య శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఇందుకు గానూ చంద్రశేఖర్‌కు రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. లెక్చరర్ చంద్రశేఖర్‌ను డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతితో పాటు అధ్యాపకులు అభినందించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

డోన్ రూరల్, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ రూరల్ ఎస్ఐ మమత అన్నారు. శనివారం డోన్ ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికల సంరక్షణ చట్టం, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, ఆత్మహత్య ఆలోచన నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- టీడీపీ పట్టణ నాయకుడు వై.హనుమంతరెడ్డి

డోన్ రూరల్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతోందని టీడీపీ పట్టణ నాయకుడు, గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ ప్రధాన కార్య దర్శి వై.హనుమంతరెడ్డి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ డోన్ పట్టణంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో మట్కా, గంజాయి, అక్రమ మద్యం వంటి అసాంఘిక కార్యకలాపాలు రాజ్యమే లాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డోన్ పట్టణంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదే శాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, పోలీసు సిబ్బంది అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యురాలు శారదబాయి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టు రోగులకు ప్రభుత్వమే వైద్యం పాటు ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. అనంతరం ఆమె కుష్టు రోగులకు మందులు, చెప్పులు అందజేశారు. కార్యక్ర మంలో వైద్యులు నితీష్, సిబ్బంది రామచంద్రారెడ్డి, నాగార్జున, విజయకుమారి, రాఘవేంద్రగౌడు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ అప్‌డేట్ సెకండ్ స్పెషల్ డ్రైవ్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 25 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీతోనే రైతుల అభ్యున్నతి

కోవెలకుంట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు గడ్డం అమర్‌నాథరెడ్డి, ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి క్రిష్ణకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

డోన్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్దే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కమలాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కమలాపురం గ్రామ పంచాయితీలో కొత్తగా రూ.40 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేగటి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఏఈ నారాయణ, ఈవోఆర్‌డీ ఫక్రుద్దీన్, ఏపీవో సుకుర్, కల్లూరి వెంకటేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి

పేరుసోమలలో..

సంజామల: పల్లెల అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పేరుసోమల సర్పంచ్ వల్లపురెడ్డి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం పల్లె పండుగలో భాగంగా పేరుసోమల, సంజామల గ్రామాల్లో కోటి రూపాయలతో అంతర్గత రహదారులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు బెలుం సురేష్ రెడ్డి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పల్లెలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. టీడీపీ పాలనలో రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. తమ అభిమాన నాయకుడు రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహాయ సహకారాలతో మండలంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో శివశంకర్ రెడ్డి, నాగిరెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి, ఏళ్ల శ్రీనివాసులు, శీలా వెంకటేశ్వర్లు, మాదాల చంద్రశేఖర్‌రావు, మల్కి హుసేన్, మద్దిలేటి, సుబ్బారావు, సానెం రవి, ఏపీవో సూర్యప్రకాష్ , టెక్నికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పేరుసోమలలో సీసీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు